## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్: ఐబీఈఎల్ 33 కేవీ లైన్ లో మరమ్మతుల కారణంగా వెంకటాద్రిపాలెం ,నందిపాడు సబ్‌స్టేషన్లకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 12నుంచి 3గంటల వరకు వెంకటాద్రిపాలెం, నందిపాడు, రవీంద్ర నగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### నోట్ పుస్తకాలు అందజేత



నోట్ పుస్తకాలు అందజేస్తున్న గ్రామస్తులు

మిర్యాలగూడ అర్బన్: మండలంలోని ఐలాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన ఉద్యోగుల సహకారంతో మంగళవారం ఉచితంగా నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకులు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సైదానాయక్, హనుమా, కాంతి, తారాసింగ్, ధర్మానాయక్ తదితరులున్నారు.

### పాఠశాలల్లో వసతులు కల్పించాలని వినతి




వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ కోరారు. విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు పుస్తకాలు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సుమాన్, వీరన్న, సిపాయి, అఫ్రోజ్, సాయి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యా సంస్థల బంద్

కొండమల్లేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ సభ్యుడు గోపిచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయా పాఠశాలల్లో వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీహరి, గణేష్, సైదులు, పవన్, అర్జున్, సింహాద్రి,రాము తదితరులు పాల్గొన్నారు.

### ఫీజులను నియంత్రించాలి

కొండమల్లేపల్లి : ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎస్‌యూఐ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు నేనావత్ కుమార్‌నాయక్ అధికారులను కోరారు. మంగళవారం చింతపల్లి మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు కార్తీక్ పమర్, రాజేష్, బన్నీ, సాయి, శివ, సాత్విక్, గౌస్, సోను పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

గుర్రంపోడు : విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని కొప్పోలు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామంలోని పొగాకు యాదయ్యకు చెందిన గేదెను ఉదయం మేతకు తోలుకెళ్లాడు. పొలంలో ఎల్‌టీ విద్యుత్ లైన్ తీగ తెగి పడగా నీరు తాగేందుకు అందులోకి వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. తనకు నష్ట పరిహారం అందించాలని బాధిత రైతు విద్యుత్ అధికారులను కోరాడు.

### గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మాడుగులపల్లి : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం ఆయన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ అనిత, నాయకులు గనిపల్లి మోహన్,నరేష్ పాల్గొన్నారు.



నారాయణపురంలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సైదులు

# వికసించని 'గిరి వికాసం'!

- గుర్రంపోడు మండలంలో ఎంపిక చేసిన 15 యూనిట్లలో బోర్ల తవ్వకాలు
- నెలలు గడుస్తున్నా విద్యుత్, మోటార్లను బిగించని అధికారులు
- పథకం ఆశయం నీరుగారుతోందని గిరిజన రైతుల ఆవేదన



గుర్రంపోడు మండలంలోని తేనపల్లి తండాలో ఎనిమిది నెలల క్రితం వేసిన బోరు

గుర్రంపోడు : గిరిజన రైతుల భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రవేశపెట్టిన గిరి వికాసం పథకం నత్తనడకన సాగుతోంది. గిరిజన రైతుల భూముల్లో వసతులు కల్పించి వాటిని సాగులోకి తేవాలని 2022వ సంవత్సరంలో ప్రభుత్వం గిరి వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. అదే ఏడాది జూన్‌లో దరఖాస్తులను స్వీకరించి జియాలజిస్టు సర్వే ఆధారంగా గుర్రంపోడు మండలంలో 16మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. పదెకరాల లోపు భూములను ఒక్కో యూనిట్‌గా పరిగణలోకి తీసుకుని 35 కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా తొలుత 15 యూనిట్లను ఎంపిక చేసి ఈ పథకం ద్వారా సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. రెండేళ్ల తర్వాత 2024 సంవత్సరం డిసెంబర్ నెలలో ఎట్టకేలకు భూగర్భజలవనరుల శాఖ సర్వే ఆధారంగా గుర్తించిన 15 యూనిట్లలో బోర్లు వేశారు. అయితే ఇంతవరకు కరెంటు, మోటార్లను బిగించ లేదు. దీంతో పథకం ఆశయం నీరుగారుతోందని విమర్శలు వస్తున్నాయి.

**ఆశయం ఘనం.. అమలులో అధమం**

సొంతంగా బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించుకోలేక మెట్ట పంటలనే నమ్ముకున్న గిరిజనులను గుర్తించి వారి భూములను సాగులోకి తెచ్చే ఈ పథకం వారికి వరప్రసాదమే. గొప్ప ఆశయంతో ప్రవేశపెట్టిన ఈ పథకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సాగుతోంది. గుర్రంపోడు మండలంలోని తేనపల్లి తండా, ఘాశీరాం తండాల పరిధిలోని లబ్ధిదారులంతా తమకు బోర్లు ఎప్పుడు వేస్తారని ఎదురు చూస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా భూముల్లోని బండరాళ్లను తొలగించి సాగులోకి తెచ్చి పండ్లతోటలను సాగు చేసుకునేలా ప్రోత్సహించాల్సి ఉంది. ప్రస్తుత వానాకాలంలో మోటార్లు అందిస్తే పంటలు సాగు చేసుకుంటామని బోర్లు వేసిన రైతులు ఆశతో ఉన్నారు.

**మోటార్లు బిగించాలి**



"అధికారులు బోర్లకు కరెంటు సౌకర్యం కల్పించి మోటార్లు అందిస్తే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసుకోవడానికి వీలుంటుంది. బోర్లు వేయడానికే రెండేళ్లకుపైగా సమయం పడితే పూర్తిగా సాగులోకి తెచ్చేందుకు ఎన్ని ఏళ్లు పడుతుందోనని అనుమానంగా ఉంది. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో పథకం అమలు చేసి గిరిజనుల భూములను సాగులోకి తేవాలి.

–వడిత్య జవహర్‌లాల్, రైతు, తేనపల్లి తండా

**ప్రతిపాదనలు పంపించాం**



"గిరివికాసం పథకంలో ప్రస్తుతం నీరు సరిపడా లభించిన ఏడు బోర్లకు త్వరలో మోటార్లు, కరెంటు ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

–మంజుల, ఎంపీడీఓ

# 'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ



మిర్యాలగూడ : అభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు, రైతులు

మిర్యాలగూడ : రైతు భరోసా పథకం అందించే విషయమై మిర్యాలగూడలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పది ఎకరాల వారికి సైతం రైతుభరోసా అందించాలని, మరికొంతమంది ఐదు ఎకరాల వరకు ఉన్న వారికే అందించాలని, ఇంకొందరు పరిమితి విధించకుండా ప్రతి రైతుకు అందించాలని కోరారు. ఉద్యోగస్తులకు, రియల్ ఎస్టేట్ భూములకు, సాగుకు పనికి రాని భూములకు రైతు భరోసా అందించవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీఏ పోరెడ్డి నాగమణి, ఏఓలు సరిత, రుషేంద్రమణి పాల్గొన్నారు.

# సల్కునూరులో మెగా వైద్యశిబిరం



గ్రామస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేములపల్లి : హ్యాండ్ ఆఫ్ హోప్ మెమోరియల్ ట్రస్ట్ పాములపాడు ఆధ్వర్యంలో మంగళవారం వేములపల్లి మండలంలోని సల్కునూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 400 మందికి పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు ఇమ్మానియేల్, వైద్యులు వాసవీ, భరత్, మనోజ్, స్వరూప్, టీం లీడర్ జంగా జయరాజ్, జానకీరామ్, స్వామి, సామియేల్, సానాబేగం, రవి, సుబ్రహ్మణ్యం, జెస్సీకుమార్, ఫ్రాన్సిస్, మధు తదితరులు పాల్గొన్నారు.

# యువజనుల సమస్యలపై డీవైఎఫ్ఐ సర్వే



విద్యార్థుల అభిప్రాయాలను సేకరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ : రాష్ట్ర వ్యాప్తంగా యువజనుల సమస్యలపై సర్వే చేస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని తక్కెళ్లపాడు, తడకమళ్ల, ఉట్లపల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించి ఆయన మాట్లాడారు. సర్వేలో వచ్చిన సమస్యలపై పోరాటాల రూపకల్పన చేసేందుకు రాష్ట్ర కమిటీ కార్యాచరణ చేపడుతుందని పేర్కొన్నారు. డ్రగ్స్ మాఫియా నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల జీవితాలతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. సర్వేలో యువత అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు చౌగాని సీతారాములు, నాగయ్య, రాంబాబు, శేఖర్, నగేష్, కోటి,శంకర్ పాల్గొన్నారు.

# ఫీజులు చెల్లించాలని ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు



పోస్టుబాక్స్‌లో కార్డులు వేస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఇంజనీరింగ్ చదువుతున్న ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ఫీజు చెల్లించాలని కోరుతూ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ గతంలో ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 10వేల ర్యాంకు వచ్చిన విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్గపూడి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాయంచు నర్సింహ, మహేశ్వరపు నరేష్, హరి, నవీన్, కిరణ్, గంగాధర్ ఉన్నారు.

# క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం



యల్లాపురంలో పాఠశాలకు ఏర్పాటు చేసిన బోర్డు



అల్వాల క్రీడా ప్రాంగణంలో పెరిగిన చెట్లు

- వసతులు కరువు.. నిర్వహణ అస్తవ్యస్తం
- ప్రజాప్రతినిధుల ఇళ్లలో క్రీడా పరికరాలు
- రూ.లక్షల ప్రజాధనం వృథా

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంగణాల ఏర్పాటుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ నిధుల నుంచి రూ.లక్షలు ఖర్చు చేసింది. వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు, యువత ఆటలు ఆడేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా యువజన క్రీడల శాఖ ద్వారా మండలంలో గ్రామాల వారీగా కిట్లను పంపిణీ చేసింది. కానీ అవి యువత ధరిచేర లేదు. క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారగా కిట్లు అటకెక్కాయి.

**అన్నీ పాఠశాలలకే...**

తిరుమలగిరి మండలంలోని మండలంలో 21 గ్రామాల్లో అధికారులు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అందులో రెండు గ్రామాల్లో మాత్రమే క్రీడా ప్రాంగణాలకు స్థలాన్ని గుర్తించారు. స్థలాలు దొరకడం లేదనే సాకుతో మిగతా 19 గ్రామాల్లో పాఠశాలలకే క్రీడా ప్రాంగణాలు బోర్డును ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. క్రీడా ప్రాంగణానికి గ్రామాలను బట్టి రూ. 2.5 లక్షల నుంచి రూ. 4లక్షల వరకు వెచ్చించారు.

**పరికరాలు ప్రజాప్రతినిధుల ఇళ్లలోనే..**

జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో అందించిన కిట్లు నాటి అధికారులు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అప్పగించారు. యువత వినియోగించాల్సిన ఆ కిట్లు ప్రజాప్రతినిధుల ఇళ్లలో మూలుగుతున్నాయి. గ్రామీణ క్రీడాకారులను గుర్తించి అందించాల్సిన కిట్లు ఆ ప్రజాప్రతినిధుల ఇళ్లలో పనికిరాకుండా ఉండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని యువత కోరుతుంది.

**వినియోగంలోకి తీసుకురావాలి**



"క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉపయోగం లేని దగ్గర ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే ఏముంటుంది. ఈ ప్రభుత్వమైనా గ్రామస్థాయిలో బీపీఈడీ చేసిన వారిని ఎంపిక చేసి వారి పర్యవేక్షణలో క్రీడా ప్రాంగణాలను నడిపించాలి.

– పగడాల రాజశేఖర్, బీపీఈడీ విద్యార్థి

**కనీస సౌకర్యాలు లేవు**



"క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు లేవు. వినియోగానికి పనికిరాని స్థలాలను ఎంపిక చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రత్యేక స్థలాల్లో ఆట స్థలాలను ఏర్పాటు చేసి, సౌకర్యాలు కల్పిస్తే క్రీడా కారులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– శివకృష్ణ, చింతలపాలెం

# కామేపల్లి చెరువును కాపాడాలని ఆందోళన



వేములపల్లి మండలం కామేపల్లి చెరువు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వేములపల్లి : కబ్జాదారుల నుంచి చెరువును కాపాడాలని వేములపల్లి మండలంలోని కామేపల్లి గ్రామస్తులు, మత్స్యకారులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కామేపల్లి గ్రామంలోని చెరువు సుమారు 180 ఎకరాలు విస్తీర్ణం కలిగి ఉండగా అక్రమార్కులు కబ్జా చేయడంతో వంద ఎకరాలకు పరిమితమైందని ఆరోపించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువు ఎండిపోవడంతో ఇదే అదునుగా భావించి భూమిని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి చెరువును కాపాడాలని కోరారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



హాలియా : వ్యాసరచన పోటీని పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సతీష్‌రెడ్డి



మిర్యాలగూడ : విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

హాలియా : ఆరోగ్యానికి హాని చేసే మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాడుపడాలని హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి సూచించారు. ఈ నెల 26న జరిగే అంతర్జాతీయ మాదవ ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హాలియాలోని లక్ష్య పాఠశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం– మాదకద్రవ్యాల వ్యతిరేక సైనికులుగా మార్చేది అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాలను వాడకూడదని, వాటికి బానిసలైతే యువత ఉజ్వల భవిష్యత్ బుగ్గిపాలవుతుందన్నారు. గంజాయి, మద్యానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

**ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి**

త్రిపురారం : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని త్రిపురారం ఎస్ఐ వీర శేఖర్ సూచించారు. మంగళవారం మండల పరిధి కంపాసాగర్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలు వాటిని అరికట్టడంలో యువత పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించి మాట్లాడారు. చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూరుగు నిర్మల, పెద్దదేవుల పల్లి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు రవి కుమార్ నాయక్ పాల్గొన్నారు.

**విద్యార్థులకు వ్యాస రచన పోటీలు**

మిర్యాలగూడ అర్బన్: 'మాదకద్రవ్యాల నిర్మూలన –అరికట్టడంలో నా కర్తవ్యం' అనే అంశంపై మిర్యాలగూడ పట్టణంలోని టూ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం జరగబోయే ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని సీఐ నాగార్జున తెలిపారు.



త్రిపురారం : వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఎస్ఐ వీరశేఖర్

## ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణిస్తే బహుమతులు

- మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్

దేవరకొండ : మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ ఆఫర్ ప్రకటించింది. దేవరకొండ డిపో పరిధిలో నడుస్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు బహుమతులు అందజేయనున్నట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ సైదులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండ నుంచి హైదరాబాద్–మాచర్ల రూట్లో నడిచే నాలుగు డీలక్స్ బస్సుల్లో గిఫ్ట్ బాక్స్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహిళా ప్రయాణికులు తమ ప్రయాణం పూర్తయిన తర్వాత టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని సూచించారు.15రోజులకు ఒక సారి డ్రా తీసి ముగ్గురు ప్రయాణికులకు బహుమతులు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

## 'విశాఖ' కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం



ఎన్నికల నేపథ్యంలో గజలాపురం పరిధిలోని విశాఖ పరిశ్రమ ఎదుట పోలీసు బందోబస్తు

మాడుగులపల్లి : మండలంలోని గజలాపురం పరిధిలోని విశాఖ పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. సంస్థలో మొత్తం 205 మంది కాంట్రాక్టు కార్మికులున్నారు. ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ పోటీ పడ్డాయి. ఐఎన్‌టీయూసీకి 125 ఓట్లు, సీఐటీయూ 80 వచ్చాయి. 45 ఓట్ల మెజారిటీతో ఐఎన్‌టీయూసీ విజయం సాధించింది. దాంతో ఆ సంఘం నాయకులు సంబరాలు చేసుకున్నారు. డీజేతో పెద్దదేవులపల్లి గ్రామం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో పరిశ్రమ వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కొంతమంది కార్మికులను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రలోభాలకు గురిచేసి ఐఎన్‌టీయూసీ విజయం సాధించేలా పావులు కదిపారని సీఐటీయూ నాయకులు ఆక్షేపించారు. ఆగామోత్కూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కొంత మంది కార్మికులకు అధికార పార్టీ తాయిలాలు ఇచ్చిందని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ ఆరోపించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులతోపాటు సంస్థ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# ఎంపీకి కాంగ్రెస్ నాయకుల అభినందనలు



ఢిల్లీలో ఎంపీ రఘువీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు

నాగార్జునసాగర్, నిడమనూరు: నల్లగొండ లోక్‌సభ సభ్యుడిగా గెలిచి మంగళవారం పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేసిన కుందూరు రఘువీర్‌రెడ్డిని నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపారు. పార్లమెంట్ భవనం ముందు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పెద్దవూర, త్రిపురారం, నిడమనూరు జెడ్పీటీసీలు అబ్బిడి కృష్ణారెడ్డి, ధనావత్ భారతి భాస్కర్ నాయక్, నందికొండ రామేశ్వరిమట్టారెడ్డి, నాయకులు అంకతి సత్యం, ముంగి శివమారయ్య, మర్ల చంద్రారెడ్డి, కొండ శ్రీనివాసరెడ్డి, ఉన్నం సత్యనారాయణ, వినయ్‌రెడ్డి, రిక్కల సుధాకర్ రెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

## అధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దూదిపాల రేఖ

కొండమల్లేపల్లి : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీపీ దూదిపాల రేఖ అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వానాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, ఎంపీఓ నర్సింహారావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి



కొంపల్లిలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకాన్ని నిలబెట్టాలని వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయులపై భరోసాతోనే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారని తెలిపారు. మండలంలోని కొంపల్లికి చెందిన షేక్ హజరత్‌అలీ రూ.15వేల విలువైన నోట్‌బుక్స్, స్లేట్స్, పెన్నులు మంగళవారం వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తరిరాము, మండల నోడల్ అధికారి, శ్రీనివాస్, హెచ్ఎం కరుముల శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ నాగమణి, ఉపాధ్యాయులు రావుల విజయలక్ష్మి, విమల, నరేషాచారి, వలంటీర్లు రఫియా, బాలమణి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్ : నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ ఆస్పత్రిలో డాక్టర్ల, సిబ్బంది కొరత ఉందన్నారు. ప్రతిరోజు 350 మంది గర్భిణులు ఓపీ సేవలకు వస్తున్నందున గైనకాలజిస్టుల సంఖ్య పెంచాలన్నారు.ఎంసీహెచ్ కిట్లు ఇవ్వడం లేదని, ప్రభుత్వం స్పందించి వెంటనే కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు బండ అనురాధ, జిట్ట సరోజ,తుమ్మల పద్మ, పాదూరి గోవర్ధన, మునుకుంట్ల ఉమారాణి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు బహూకరణ

మాడుగులపల్లి : గత విద్యా సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన మాడుగులపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థులు నగదు బహూకరించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు, ద్వితీయ ర్యాంకు విద్యార్థికి రూ.3వేలు, తృతీయ ర్యాంకు సాధించిన వారికి రూ.2వేలు అందించారు. పాఠశాలకు చెందిన 2000–01 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో కొన్నేళ్లుగా అదే పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు